SPOT EDITION
2PM

www.ninadam.co.in

# నినాదం

గురువారం 28-3-2024 నిఖార్సైన జర్నలిజం

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## ప్రశాంతంగా కొనసాగుతున్న

# ఎమ్మెల్సీ ఉప ఎన్నిక...

### ఓటు హక్కు వినియోగించుకున్న గద్వాల ఎమ్మెల్యే




**జోగులాంబ గద్వాల :** ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకునారు. గురువారం గద్వాల జిల్లా కేంద్రం లోని ఉమ్మడి మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా స్థానిక తన ఓటు హక్కును జడ్పీ కార్యాలయం సమావేశం మందిరంలో వినియోగించుకున్నారు. ఎన్నికల కేంద్రంలో జరుగుతున్న ఓటింగ్ సందర్భంగా తన ఓటు వేశారు. ఖచ్చితంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయం అని అన్నారు. ఎమ్మెల్యే వెంటనే ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నిక ప్రశాంతంగా కొనసాగుతున్నది. ఉప ఎన్నిక పోలింగ్‌ను సమీకృత కలెక్టరేట్ కంట్రోల్ రూం వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్,అదనపు కలెక్టర్లతో కలిసి పర్యవేక్షించారు.

## జోగులాంబ జిల్లాలో దొంగల హల్‌చల్

### భారీగా బంగారం, నగదు చోరీ



**హైదరాబాద్ :** జోగులాంబ గద్వాల జిల్లాలో వరుసు దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. తాళం వేసిన ఇండ్లే లక్ష్యంగా దుండగులు చోరీలకు పాల్ప డుతున్నారు. తాజాగా తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చొరబడిని దొంగలు రూ.10 లక్షలు, 40 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### ఇది కాలం తెచ్చిన కరువు కాదు

# కాంగ్రెస్ కరువు





- కాంగ్రెస్ నిర్లక్ష్య విధానాలతో ఆగమైపోతున్న రైతులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**సిరిసిల్ల:** కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య విధానాల వల్ల రైతులు ఆగమైపోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సారంపల్లిలో ఇటీవల వడ గండ్ల వానకు నష్టపోయిన పంట లను కేటీఆర్ పరిశీలించారు. పంటల నష్టంపై రైతులను వివ రాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ.. రైతుల్లో భరోసా నిపం డానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలి పారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, ఇప్పటిరకు చేయ లేదని విమర్శించారు. రైతుబంధుకు కేసీఆర్ సర్కార్ రూ.7 వేల కోట్లు సిద్ధంచేసిం దని, కానీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పంటసాయాన్ని ఆపిందని చెప్పారు. తాము రైతు ల కోసం ఉంచిన డబ్బులను కాంగ్రెస్ పార్టీ కాం ట్రాక్టర్లకు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, చివరికి వారిని కూడా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్ల ర్లను రిపేర్ చేయడానికి రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని విమర్శించారు.

### బిస్కెట్ ఫ్యాక్టరీలో

## అగ్నిప్రమాదం..

### దట్టంగా అలముకున్న పొగలు



హైదరాబాద్: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఓ బిస్కెట్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాజేంద్రనగర్ పరిధిలోని కాటేదాన్‌లో ఉన్న రవి బిస్కెట్ తయారీ పరిశ్రమలో గురువారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. క్రమంగా అవి ఫ్యాక్టరీలోని మూడు అంతస్థులకు వ్యాపించాయి. దీంతో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకోవడంతో స్థానికుల ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపుచేయడానికి ప్రయత్నిస్తున్నారు. కాగా, మిషనరీ, బిస్కెట్ తయారీ ముడిసరుకు పూర్తిగా మంటల్లో కాలి బుడిదైంది. కోట్లల్లో ఆస్తినష్టం వాటిల్లినట్లుగా అంచనా వేస్తున్నారు. నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు అనుమానం వ్యక్తమవుతున్నది.

# కాంగ్రెస్‌కు షాక్...



**న్యూఢిల్లీ, మార్చి 28 (నినాదం న్యూస్) :** కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. నాలుగేళ్లపాటు రీఅసెస్‌మెంట్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలన్న ఆదాయపు పన్ను శాఖ ఆదేశాలను సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. 2014-2017 మధ్య పన్నుల రీవాల్యుయేషన్‌పై కాంగ్రెస్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ, జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పిటిషన్లను తిరస్కరించింది. 2014-15, 2015-16, 2016-17 అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించి రీ-అసెస్‌మెంట్ ప్రొసీడింగ్‌లను సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌లను మార్చి 22న కోర్టు కొట్టివేసింది. ఐటీశాఖ తాజాగా పరిశీలన ప్రారంభించిన ఇతర అసెస్‌మెంట్ సంవత్సరాలకు సంబంధించిన తాజా నాలుగు పిటిషన్‌లను కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో టాక్స్ అథారిటీ ఎలాంటి చట్టబద్ధమైన నిబంధనల్ని ఉల్లంఘించలేదని.. పార్టీ ఆదాయం రూ.520 కోట్ల కంటే ఎక్కువగా ఉందని కోర్టు పేర్కొంది. కాంగ్రెస్ రిట్ పిటిషన్లను కొట్టివేస్తున్నామని తెలిపింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అకౌంట్‌లో ఉన్న రూ.105 కోట్లను ఐటీశాఖ ఫ్రీజ్ చేసిన విషయం తెలిసిందే. ఫ్రీజ్ చేసిన నిధులను రిలీజ్ చేయాలంటూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేవేసిన విషయం తెలిసిందే. 2018-19 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి రూ.102 కోట్ల బకాయి పన్నును రికవరీ చేయాలని ఐటీశాఖ కాంగ్రెస్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే దీనిపై స్టే విధించాలని హస్తం పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ నోటీసుపై జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ.. స్టే కోరుతూ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అయితే, పార్టీ నుంచి రూ.65.94 కోట్ల మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు ఈ మధ్యకాలంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఐటీఏటీ ఎదుట స్టే కోసం దరఖాస్తు దాఖలు చేసేందుకు కాంగ్రెస్‌కు అనుమతి ఇచ్చింది. స్టే కోసం తాజా దరఖాస్తును తరలించడానికి కోర్టు కాంగ్రెస్‌ను అనుమతించింది.

> **కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. నాలుగేళ్లపాటు రీఅసెస్‌మెంట్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలన్న ఆదాయపు పన్ను శాఖ ఆదేశాలను సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. 2014-2017 మధ్య పన్నుల రీవాల్యుయేషన్‌పై కాంగ్రెస్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.**

### ఒత్తిళ్ల వల్ల న్యాయవ్యవస్థకు

# ముప్పు



### సుప్రీంకోర్టు సీజేఐకి 600 మంది న్యాయవాదుల సంచలన లేఖ..!

**పలువురు న్యాయవాదులు తాజాగా మన దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు ఎక్కువగా జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ముఖ్యంగా రాజకీయ నేతలకు సంబంధించిన అనేక కేసుల్లో వారు కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు కొన్ని వత్తిళ్లు గురి చేస్తున్నాయని ఆరోపించారు.**

**న్యూఢిల్లీ, మార్చి 28 (నినాదం న్యూస్) :**పలువురు న్యాయవాదులు తాజాగా మన దేశంలో న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నాలు ఎక్కువగా జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ముఖ్యంగా రాజకీయ నేతలకు సంబంధించిన అనేక కేసుల్లో వారు కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు కొన్ని వత్తిళ్లు గురి చేస్తున్నాయని ఆరోపించారు. తాజాగా ఇందుకు సంబంధించి ప్రముఖ లాయర్లు ఈ మేరకు హరీశ్ సాల్వే, పింకీ ఆనంద్‌లతో సహా 600 మందికి పైగా లాయర్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడకు ఓ లేఖ రాశారు. దింతో ప్రస్తుత్తం జరగబోయే లోక్ సభ ఎన్నికల వేళ ఇది చర్చనీయాంశంగా మారింది. స్వార్థ ప్రయోజనాలను ఆశించే కొన్ని గ్రూప్ల పొలిటికల్ అజెండాతో న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు వారు తెలుపుతున్నారు. మరికొందరైతే ఏకంగా న్యాయపరమైన ప్రక్రియలను ప్రభావితం చేస్తూ, కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం అలంటి వారు అనేక మార్గాలను అనుసరిస్తున్నారని.. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు న్యాయస్థానాల కీలక తీర్పుల పై తప్పుడు కథనాలు సృష్టిస్తున్నారని తెలుపుతున్నారు. ఈ మధ్య కాలంలో ముఖ్యంగా కొందరు న్యాయవాదులు పగలు రాజకీయ నాయకులను సమర్థిచడం, మల్లి అదే రోజు రాత్రి మీడియాతో న్యాయమూర్తులను ప్రభావితం చేయడం లాంటి అంశాలు బాధాకరం అని లాయర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా కొందరు రాజకీయ నాయకులు కొందరిపై అవినీతి ఆరోపణలు చేయడం.. ఆపై వారినే కోర్టుల్లో సమర్థించడం చాలా వింతగా ఉందని.. ఒకవేల ఆ సమయంలో కోర్టు నిర్ణయాలు తమకు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగ విమర్శలకు దిగుతున్నట్లు లాయర్లు వాపోయారు. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరుతున్నట్లు న్యాయవాదులు తమ లేఖలో కారడం జరిగింది.

# నిజ్జార్ హత్య

### దర్యాప్తుపై స్పందించిన కెనడా ప్రధాని ట్రుడో..!



భారత్ ప్రకటించిన ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకు సంబంధించిన దర్యాప్తుపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. హత్యపై తేల్చేందుకు భారత ప్రభుత్వంతో కలిసి నిర్మాణాత్మకంగా పనిచేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కెనడా పౌరుడు హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్య కేసు దర్యాప్తులో భారతదేశం సహకారంపై ట్రూడోను ప్రశ్నించగా.. కెనడియన్ గడ్డపై కెనడా పౌరుడి హత్య అంగీకరించకూడని విషయమని, చాలా సీరియస్‌గా తీసుకోవాలన్నారు. భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని ఆరోపణలున్నాయని.. దాన్ని తాము తేలిగ్గా తీసుకోలేదన్నారు. విదేశీ ప్రభుత్వాల చట్టవిరుద్ధ చర్యల నుంచి కెనడియన్లందరినీ రక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఈ విషయంపై కెనడా ప్రభుత్వం సరైన విచారణ జరుపుతుందని ట్రూడో చెప్పారు. ఈ విషయంలో భారత ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా పని చేయడానికి ఎదురు చూస్తున్నాం.. ఇది ఎలా జరిగిందో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. గతంలో నిజ్జార్ హత్యలో భారత ప్రభుత్వం హస్తం ఉందని గతంలో జస్టిన్ ట్రూడో ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఆరోపణలను భారత్ తోసిపుచ్చింది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల నిజ్జార్ హత్యకు సంబంధించిన వీడియో వెలుగులోకి వచ్చింది. 2020లో జాతీయ దర్యాప్తు సంస్థ నిజ్జార్‌ను ఉగ్రవాదిగా ప్రకటించింది. గతేడాది జూన్‌లో బ్రిటీష్ కొలంబియాలోని సర్రేలోని గురుద్వారా నిజ్జార్ హత్యకు గురయ్యాడు. అతన్ని ఓ కాంట్రాక్ట్ కిల్లర్ హతమార్చాడు.

### దానం మెడకు

# బిగుస్తున్న ఉచ్చు



- ఎంపీ అభ్యర్థిత్వం సొంత పార్టీలోనే అసంతృప్తి
- బీఆర్ఎస్ కోవర్టుగా దానం కాంగ్రెస్‌లోకి వచ్చారు
- నమ్మకం కుదరాలంటే ఎమ్మెల్యే సీటుకి రాజీనామా చెయ్యాలి
- ఢిల్లీలో కాంగ్రెస్ ఆఫీస్ ముందు ప్లకార్డులతో నిరసన

**హైదరాబాద్, మార్చి 28 (నినాదం న్యూస్) :** పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు మెడకు ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే దానంపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవ్వగా.. ఆయనకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ వేశారు రాజుయాదవ్. దీనిపై ఇవాళ విచారణ జరగనుంది. దానం నాగేందర్‌పై ఖైరతాబాద్ కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ కోవర్టుగా దానం కాంగ్రెస్‌లోకి వచ్చా రంటూ నేతలు అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఎంపీ అభ్యర్థి త్వాన్ని రద్దు చెయ్యాలని ఏఐసిసి కి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో కాంగ్రె స్ ఆఫీస్ ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎంపీగా గెలిచినా దానం మళ్లీ పార్టీ మారతారని స్పష్టం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. నమ్మకం కుదరాలంటే దానం ఎమ్మెల్యే సీటుకి రాజీనామా చెయ్యా లని డిమాండ్ చేస్తున్నారు కాంగ్రెస్ నేత రాజు యాదవ్. దానంపై అనర్హత వేటు వెయ్యాలని ఇప్పటికే స్పీకర్‌కి రాజుయాదవ్ ఫిర్యాదు చేశారు. నాగేందర్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలని రాజు యాదవ్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఒక పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుండి ఎంపీగా పోటీ చేయడం చట్టవిరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ మేరకు దానం నాగేందర్‌పై అసెంబ్లీ స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరారు. దానంకు వ్యతిరేకంగా దాఖలైన ఈ పిటిషన్‌పై హైకోర్టులో ఇవాళ విచారణ జరిగే అవకాశం ఉంది. దానం నాగేందర్ బలమైన నేత అనుకొని టిక్కెట్ ఇచ్చారని, కానీ తమ దృష్టిలో ఆయన బలమైన నాయకుడేమీ కాదన్నారు రాజుయాదవ్. పార్టీ అధిష్ఠానం టిక్కెట్ ఇచ్చింది కాబట్టే తాము వ్యతిరేకించడం లేదన్నారు. ఫైనల్‌గా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేస్తే.. దానం నాగేందర్ ఎంపీగా గెలుస్తాడన్నారు.

### కోటాలో మరో విద్యార్థి

# బలవన్మరణం

### రెండు రోజుల్లో రెండో ఘటన



**జైపూర్:** రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక 19 ఏండ్ల విద్యార్థిని బలవన్మరణం చెందింది. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన సౌమ్య .. ఓ హాస్టల్ ఉంటూ నీట్ పరీక్షకు సన్నద్ధ మవుతున్నది. ఈ క్రమంలో హాస్టల్‌లోని తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. దీంతో రెండు రోజుల్లోనే ఇద్దరు చనిపోయినట్లయింది. మొత్తంగా కోటాలో ఈ ఏడాది ఇది ఎనిమిదో ఆత్మహత్య. కాగా, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, వారు కోటాకు వచ్చిన తర్వాత పోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు. ఈ నెల 25న ఉరుజ్ ఖాన్ అనే నీట్ విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు. అతడు కూడా యూపీకి చెందినవాడే కావడం గమనార్హం. విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గతేడాది కోటాలో 29 మంది ఆత్మహ్యా చేసుకున్నారు. వారంతా నీట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నవారే కావడం విశేషం.